# సమాధుల తోట

లలిత కోసమయి వాళ్ల ఆఫీసులోకి నడుస్తున్నారో లేదో ఆమె బయటకు వస్తూ కనిపించింది. తను కొద్దిగా ఆలస్యం అయి ఉంటే వెళ్లిపోయి ఉండేది.

"నీ కోసమే వచ్చాను" అన్నాను.

"చాలా రోజుల తర్వాత గుర్తు వచ్చానే" అని నవ్వి "పర్మిషన్ తీసుకుని బయటకు వెళ్తున్నాను. నీకు వేరే పనేమీ లేకపోతే నాతో రాకూడదూ?" అడిగింది.

ఆమె పక్కనే నడుస్తూ, "ఎక్కడికి?" అడిగాను.

"ఇవ్వేళ ఆల్‌సోల్స్‌డే" సమాధుల తోటకు వెళ్తున్నాను. రావడానికి నీకేం అభ్యంతరం లేదు కదా?"

"లేదు"

"మా పిల్లలను బడి నుండి సరాసరి సమాధుల తోటకు రమ్మని చెప్పాను. ఇప్పటికే వచ్చి నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు" అంది.

ఇద్దరం రోడ్డు మీదకు వచ్చి ఆటో రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నాం. ఆటో కదిలింది.

అక్కడికి బోయిగూడ సమధులతోట రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. చేతి గడియారం వంక చూసుకున్నాను. చీకటిపడే లోపల ఇంటికి చేరుకోవచ్చు. మా ఆయనకు నేనంటే అనుమానం. ఆఫీసు నుండి ఇంటికి చేరుకోవడం ఆలస్యం అయితే సూటి పోటు మాటలు అంటుంటాడు. విని విని విసుగెత్తి పోయాను. అతని మాటలకు జవాబు చెప్పాలని కూడా అనిపించదు. పట్టుబట్టి కావాలని కోరి మరీ నన్ను పెళ్ళి చేసుకున్న మనిషి.

"చెప్పు, ఎలా ఉన్నావు?" అడిగింది లలిత.

"బాగానే ఉన్నాను"

"నీ పెళ్ళి అయి సంవత్సరం దాటింది కదా, విశేషం ఏమీ లేదా?"

"లేదు."

నా పెళ్ళికి తప్పకుండా వస్తానంది కాని రాలేదు. ఆ మాటే నిష్ఠూరంగా అంటే, "రాలేక పోయాను. నీ పెళ్ళి రోజున ఈ ఊళ్లోనే ఉన్నాను. ఒక అర్జంటు పని నన్ను ఎటూ కదల నీయకుండా చేసింది. పెళ్ళి ఘనంగా జరిగిందని విన్నాను. నీ జీవితం ఎలా ఉంది?" అంది.

ఏం చెప్పేది? గాలికి నుదుటి మీద పడుతున్న జుట్టు వెనక్కి నెట్టుకుంటూ తల పక్కకు తిప్పుకున్నాను.

"పెళ్ళి అయ్యాక ఉద్యోగం మానేస్తానని అన్నావు..."

"మానేద్దామనే అనుకున్నాను. నెల తిరిగే సరికి విసుగు పుట్టి తిరిగి ఉద్యోగంలో చేరాను."

"మీ ఆయన ఒప్పుకున్నాడా?"

"నేను ఉద్యోగం చేయడం ఆయనకు ఇష్టం లేదు".

లలిత నా కుడి చేతిని తన చేతుల్లోకి తీసుకుని నా గాజులు సవరిస్తూ మా ఆయన వ్యాపారం గురించి, సంపాదన గురించి అడుగుతూ నా చేతిని సుతారంగా నొక్కుతూ "బాబూరావును ఎలా మర్చిపోగలిగావు?" అడిగింది.

'లేదు. నేను బాబూరావును మర్చిపోలేదు. మర్చిపోలేను. అతను నాకు గుర్తు రాని రోజుండదు' అందామనుకున్నాను కాని అనలేకపోయాను. ఆ మాటలు అంటే నా కళ్ళల్లో నీళ్లు ఉబుకుతాయి. నా కన్నీరు లలిత కంటబడడం నాకు ఇష్టం లేదు. మాట బయటకు వస్తే కంఠం దుఃఖంతో నిండిపోతుంది. తల అడ్డంగా ఆడించి దృష్టి రోడ్డు మీదకు సారించాను.

"నువ్వు హృదయం లేని మనిషివి" అంది.

కొద్ది సేపు మవునంగా ఉండి తలతిప్పకుండా "బాబూరావు ఎలా ఉన్నాడు?" అడిగాను.

"నిన్ను ఎంతగానో ప్రేమించిన మనిషి ఎలా ఉంటాడని ఊహిస్తున్నావు?"

వెంటనే ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు. చిన్నగా దగ్గి, "అన్నీ మనం అనుకున్నట్టే జరిగితే, జీవితం ఎంత హాయిగా ఉంటుంది? నేను అతన్ని ఇంకా ప్రేమిస్తున్నాను. నేను అబద్దం చెప్పడం లేదు. తిరిగి ఉద్యోగంలో చేరాక అయిదారు సార్లు అతని ఆఫీసుకు ఫోను చేశాను. ఎప్పుడూ దొరకలేదు. లేదనే జవాబు వచ్చింది.

తర్వాత నెంబరు మారిందని తెలిసి కొత్త నెంబరుకు ప్రయత్నించాను. లాభం లేకపోయింది. చివరకు ఈ రోజు అతన్ని చూడాలని ఎంతో ఆశతో వాళ్లాఫీసుకు వెళ్ళాను వాళ్ల ఆఫీసు పాత బస్తీలో ఎక్కడకో మార్చారట. అతని గురించి తెలుసుకోడానికి నీ దగ్గరకు వచ్చాను" అన్నాను.

"అంతగా ప్రేమించిన మనిషిని ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? కులాంతర వివాహమని భయపడ్డావా?"

"అదేం లేదు. మా ఇంట్లో మా అమ్మను ఒప్పించాను. కష్టపడి అన్నయ్యను ఒప్పించాను. మా చిన్నాన్నే ఒప్పుకోలేదు. చాలా గొడవ చేసి, బలవంతంగా నా మెడలు వంచి నా పెళ్ళి చేశారు. మా చిన్నాన్న సంగతి నీకు బాగా తెలుసు. మా ఇంట్లో అందరూ నా మీద జాలిపడినా ఆయన మాటకు ఎదురు చెప్పలేకపోయారు...." చెబుతున్నాను.

లలిత నా మాటలకు అడ్డుతగిలి, "నువ్వు చాలా విచిత్రమయిన మనస్తత్వం కలిగిన దానివి. ఎదుటి వాళ్లకు అర్థమయినట్టే ఉంటావు కాని అర్థం కావు. నీ అభిప్రాయాలు స్థిరంగా ఉండవు. మారిపోతుంటాయి. మనిషి మంచి దానివే. వెల్. ఇప్పుడు అంతా అయిపోయింది. ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కదిపి నువ్వు సాధించదల్చుకుంది ఏమిటి?" అంది.

"నేనతన్ని మర్చిపోలేక పోతున్నాను. నాకతన్ని చూడాలని ఉంది. అయిదు నిమిషాలపాటయినా అతనితో మనసారా మాట్లాడాలని ఉంది. అంతే, నాకింకేమీ వద్దు" అన్నాను.

పావుగంట తర్వాత ఆటో బోయిగూడ సమాధుల తోట ముందు ఆగింది. దిగి మీటరు చూసి డబ్బులిచ్చి కిటకిటలాడుతున్న జనాల్లోంచి అడుక్కునే వాళ్లను, పూలు, కొవ్వొత్తులు, అగరబత్తులు అమ్మేవాళ్లను తప్పించుకుంటూ లోపలికి నడిచాం.

నేను సమాధుల తోటలోకి అడుగు పెట్టడం అదే మొదటి సారి. లలిత భర్త సమాధి సమాధుల తోట చివర గోడవారగా ఒక మూలకు ఉంది. మేం రాకముందే లలిత కూతురు, కొడుకు, సమాధిని రకరకాల పూలతో అలంకరించి చుట్టూ కొవ్వొత్తులు పెడుతున్నారు. వెలిగిస్తోంటే గాలికి కొన్ని కొవ్వొతులు ఆరిపోతున్నాయి. తోట నిండా జనం ఉన్నారు.

మమ్మల్ని చూడగానే పిల్లలు నన్ను పలకరించి లలితకు రోజా పూలు అందించారు. లలిత వాటిని సమాధి మీద సిలువ ఆకారంలో పేర్చి. అగరొత్తులు

వెలిగించింది. కొంగుతో తల కప్పుకుని మూడు నిమిషాల పాటు ప్రార్థన చేసింది. ఆమె చేస్తున్నప్పుడు నేను కళ్లు మూసుకోలేదు. ఆమె ముఖంలోకి, పిల్లల ముఖంలోకి చూశాను. అందరి కళ్ల వెంట నీళ్లు కారుతున్నాయి. ఆ సమయంలో లలిత ముఖం ఎంతో గంభీరమయి నేనెప్పుడూ చూడని కొత్త లలితలా అవుపించింది.

ప్రార్థన ముగించిన తర్వాత లలిత పిల్లలు వాళ్లకు తెలిసిన వాళ్లెవరో కనిపిస్తే వాళ్లతో మాట్లాడుతోంటే లలిత మిగిలిపోయిన పూలను, కొవ్వొత్తుల పేకెట్, అగరొత్తులు ప్లాస్టిక్ బుట్టలో వేసి "పద" అని అక్కడికి దగ్గరలో ఉన్న మరో సమాధి ముందు ఆగింది. సున్నం కొట్టిన ఆ మట్టి సమాధి చుట్టూ పూలు పేర్చి, కొవ్వొత్తుల పేకెట్ నాకు అందించి "ఈ పేకెట్ విప్పి కొవ్వొత్తులు వెలిగించి ఈ సమాధి చుట్టూ పెట్టు" అంది.

ఈ తతంగం నాకు చేయాలనిపించడం లేదు. విసుగు కలిగిస్తోంది. విసుగు బయటకు రానీయకుండా ఆమె ముఖంలోకి ఇబ్బందిగా చూశాను. అగరొత్తులు వాసనకు నాకు తలనొప్పి మొదలయింది. కొవ్వొత్తుల పేకెట్ అయిష్టంగా అందుకుని సమాధి చుట్టూ పెట్టాను. వెలిగిస్తుంటే కొన్ని ఆరిపోతున్నాయి. ఆ వాసన , ఆ గాలికి నా ఊపిరి బిగుసుకు పోతున్నట్టు అనిపిస్తోంది. అక్కడి నుండి ఎంత త్వరగా బయటకు వెళ్ళి పోదామా అనిపిస్తోంది.

లలిత నా పక్కగా వచ్చి నిలబడింది. రుమాలుతో నా చేతులు తుడుచుకుంటుంటే, "నీకు శ్రమ కలిగించినందుకు ఏమీ అనుకోకు. ఈ సమాధి బాబూరావుది అని తెలిసి ఉంటే నువ్వు అంత అయిష్టంగా కొవ్వొత్తులు అందుకుని, విసుగుతో వెలిగించే దానివి కావు" నెమ్మదిగా అంది.

నా తల మీద పిడుగు పడినట్టనిపించింది. కాళ్లు భూమిలోకి దిగబడి పోతున్నట్టుగా ఉంది. ఆమె మాటలు నమ్మబుద్ధి కావడంలేదు. లలిత నాతో అబద్దాలు ఆడుతోంది. నిమిషం పాటు నిరుత్తరనయి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతోంటే నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడిస్తూ ఎక్కడ లేని నిస్సత్తువ నన్ను ఆవరించే సరికి నిలబడలేక పక్కనే ఉన్న సమాధి మీద కూర్చుండిపోయాను. దుఃఖం ఆగడం లేదు. నోటికి చీరకొంగు అడ్డం పెట్టుకున్నాను. ఇటువంటి వార్త వింటానని నేను ఊహించలేదు.

పది నిమిషాల తర్వాత లలిత నా భుజం మీద చేయి వేసి "లే వెళ్దాం" అంది.

"ఎప్పుడు చనిపోయాడు?" అడిగాను.

"నీ పెళ్ళికి నాలుగు రోజుల ముందు"

"నా పెళ్ళికి నాలుగు రోజుల ముందు నన్నతను కలిసాడు. హోటల్ సరోవర్‌లో భోజనం చేశాం. రెండుగంటలపాటు ఇందిరాపార్కులో కూర్చున్నాం. విడిపోయేప్పుడు అతన్ని వదులుకోవడం ఇష్టం లేక మనిద్దరం ఎటయినా వెళ్ళి పోయి పెళ్ళి చేసుకుందామని మరీ మరీ కోరాను. అవునన లేదు, కాదనలేదు.... బాబూరావు ఆత్మహత్య చేసుకున్నాడా?" ఏడుస్తూనే అడిగాను.

లలిత తల అడ్డంగా ఆడించి "లేదు" అంది.

"యాక్సిడెంటా? ప్లీజ్... ఏమయిందో చెప్పు...?"

"నీ పెళ్ళికి ముందు అతనితో ఎటయినా వెళ్ళిపోదామన్న మాట మీ ఇంట్లో ఎవరితోనయినా అన్నావా?"

"చెప్పలేదు"

"గుర్తు తెచ్చుకో"

".... యస్.... అవును... మా పిన్నితో అన్నాను.... ఇంకెవరితో అనలేదు.... ఆమెతోనే అన్నాను....."

"మీ పిన్ని అంటే డి.సి.పి. రాంబాబు భార్య, అవునా?"

"అవును రాంబాబు మా చిన్నాన్న."

లలిత దీర్ఘంగా నిట్టూర్చి, "బాబూరావును నువ్వే దారుణంగా చంపేసుకున్నావు. బంజారా హిల్స్‌లో ఆ తెల్లవారుఝామున జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో అతను చనిపోయాడు. ఈ వార్త అన్ని దిన పత్రికలలో వచ్చింది. ఒక పత్రిక వాళ్లు కలర్ ఫొటో కూడా వేశారు. రెండు రోజుల తర్వాత మీ చిన్నాన్న నాకు శవాన్ని అప్పగించాడు" అంది.

****

"చిన్నాన్నా, ఈ ఉత్తరాన్ని ఎంత క్లుప్తంగా రాద్దామనుకున్నా ఇంతయింది. నేను అసహాయురాలిని. చిన్నప్పుడు మాకు సహాయం చేయలేదని అనను. ఇంట్లో వాళ్లకు ఇష్టం లేని పని నేను చేస్తానని అమాయకుడయిన బాబూరావును చంపడం ఘోరం. అతన్ని ప్రేమించిన నేరానికి నన్ను చంపి ఉండవలసింది. ఎంత న్యాయమయిన మనసయ్యానీది? నీకూ కిరాయి హంతకులకూ తేడా ఏమీ లేదనుకుంటాను.

"చివరిగా ఒక్క కోరిక, నేను చనిపోయాక దయచేసి నా శవాన్ని ముట్టుకోకు. నా పాడెను ఎత్తకు. అన్యం పుణ్యం తెలియని అమాయకులను పొట్టన పెట్టుకుంటూ సమాధుల తోటను పెంచకు".

గడచిన ఆరు నెలల్లో ఆ ఉత్తరాన్ని ఎన్నో సార్లు చదివాడు రాంబాబు. ఉత్తరం మడిచి బల్ల సొరుగులో పెట్టి కళ్ళద్దాలు తీసి బల్ల మీద పెట్టాడు. చదివినప్పుడల్లా మనసు భారమవుతుంటుంది. సొరుగులో ఉన్న రివాల్వర్ తీసి బెల్టు కవరులో పెట్టి ఫోను అందుకోబోతుంటే ఫోను మోగింది. అందుకుని, "రాంబాబు హియర్" అన్నాడు.

"నేను"

ఎ.సి.పి కంఠ స్వరం వెంటనే గుర్తు పట్టాడు రాంబాబు. "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు.

"వెరీ గుడ్ మార్నింగ్. నీకో గుడ్ న్యూసోయ్".

"చెప్పండి సార్".

"ఈ సారి బంగారు పతకానికి నీ పేరు గురూగారు రికమెండ్ చేశారు. ఇందుకు నువ్వు పార్టీ ఇచ్చుకోవాలోయ్".

"తప్పకుండా సార్".

"ఇంకో సంగతి.... అయిదు రోజుల కిందట యాదగిరి, రెహమాన్ లను పట్టుకున్నాం కదా, వాళ్లను ఏ నాచారమో, ఉప్పలో తీసుకెళ్ళి నొక్కేయి. ఎప్పుడూ బంజారాహిల్స్ అయితే బావుండదు. ప్రదేశాలు మారుస్తూ ఉండు. ఈ ఆర్డర్స్ నావికావు గురూగారివి. పని అయి పోయాక ఫోను చేయకు. నన్నొకసారి కలువు."

"ఎస్ సార్. గుడ్ డే సార్" అని ఫోను పెట్టి "రేయ్ వెంకటేశూ! కారు సిద్ధం చేయరా" అన్నాడు. రాంబాబు ఉత్సాహంగా అతను ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు. అన్నింటికీ అతీతుడు.

❖ **ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 28 జూలై 1995**